సూర్య
18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 8 నవంబర్ 2024
పేజీలు 8

## దీపం-2తో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

**సందేహాలకు టోల్ ఫ్రీ నంబరు 1967కు కాల్ చేయండి**

**జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దీపం-2 పథకంతో ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చుని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వినియోగదారులను కోరారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ దీపం-2 పథకం వినియోగంపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2

# నాణ్యమైన విద్యుత్తు లక్ష్యం

**మైలవరంలో విద్యుత్ ఉపకేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**



**విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణంతో నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా సాధ్యం**

**శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్**

**కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇంచార్జి కలెక్టర్ నిధి మీనా, విజయవాడ ఆర్డీవో సిహెచ్.చైతన్య.**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/జి.కొండూరు, మేజర్ న్యూస్ :** మైలవరం, జి.కొండూరు పట్టణ గ్రామ ప్రాంత విద్యుత్తు వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందించాలనే లక్ష్యంతో విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించినట్లు శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. టాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మైలవరంలో రూ. 20.78 కోట్ల నిర్మించిన 132/33 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మిగతా 2లో

### పెడన, గన్నవరంలలో అధునాతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లు

2



## బాధితులతో మర్యాదగా వ్యవహరించండి

**సమస్యలను త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి**

**నున్న పోలీస్ స్టేషను ఆకస్మిక తనిఖీలో**

**సీపీ ఎస్.వి.రాజశేఖర బాబు**

వివరాలు 2లో...

**నిత్యావసర సరుకుల కృత్రిమ కొరత సృష్టిస్తే**

## చర్యలు తప్పవు

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



వివరాలు 2లో

# ప్రజల క్షేమమే ధ్యేయం



**నగరాభివృద్దే లక్ష్యంగా చర్యలు**

**ఎంపీ కేశినేని శివనాథ్**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల క్షేమమే ధ్యేయంగా, నగరాభివృద్ధి లక్ష్యమని పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని ) నగరాభివృద్ధి కొరకు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విజయవాడలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, నగర పరిధిలో గల డ్రైనేజ్ సిస్టం, త్రాగునీటి సరఫరా, స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధికి కావాల్సిన తదితర అంశాలు ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ ఎలాంటి వరద ముంపుకి గురికాకుండా అధికారుల పటిష్ట మిగతా 7లో...

(మొదటిపేజీ తరువాయి)

## దీపం-2తో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏదైనా గ్యాస్ కనెక్షన్ కలిగి రేషన్, ఆధారు కార్డులు ఉన్న ప్రతి వినియోగదారుడు దీపం 2 ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందుటకు అర్హులని పేర్కొన్నారు. ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ కు బ్యాంకు ఖాతా, రేషన్, ఆధార్ కార్డు తప్పనిసరిగా అనుసంధానం అయి ఉండాలన్నారు. గ్యాస్ కనెక్షన్ తో బ్యాంక్ ఖాతా వివరాలు అనుసంధానం కాకపోయి ఉంటే గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుడి గృహం వద్దే ఈ కేవైసీ చేసుకుంటారని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందుటకు వినియోగదారుడు మొదట ఖాళీ గ్యాస్ సిలిండర్ ను బుక్ చేసుకుని నగదు చెల్లించాల్సి ఉంటుందని, సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ నగదు మొత్తం నేరుగా లబ్ధిదారుడి ఖాతాకు జమ అవుతుందన్నారు. ఈ పథకం ఇప్పటికే నవంబరు ఒకటవ తేదీ నుంచి ప్రారంభమై మొదటి సిలిండర్ పొందుటకు బుకింగ్‌లు మొదలయ్యాయని, ఇది మార్చి 2025 వరకు కొనసాగుతుందన్నారు. అప్పటిలోగా వినియోగదారులు మొదటి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవచ్చని, ఈ విషయంలో వినియోగదారులు ఆందోళన చెందనవసరంలేదన్నారు. రెండవ సిలిండర్ ను ఏప్రిల్ నుంచి జూలై మాసం మధ్య, అదేవిధంగా మూడవ సిలిండర్ ఆగస్టు నుంచి డిసెంబర్ మాసం మధ్య బుక్ చేసుకుని ఉచిత గ్యాస్ సిలిండర్ ను పొందవచ్చన్నారు. జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటి వరకు 1.3 లక్షల గ్యాస్ సిలిండర్లు బుకింగ్ అయ్యాయని, అందులో 70 వేల సిలిండర్ల వరకు డెలివరీ అయినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.ఈ పథకం పొందుటలో వినియోగదారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1967కు కాల్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారిణి వి.పార్వతీ పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నిత్యావసర సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో కందిపప్పు బియ్యము సన్నవర్ ఆయిల్,పామాయిల్ టమోటా ఉల్లిగడ్డలు తదితర నిత్యవసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్లో, రైతు బజార్లో ఎలా ఉన్నాయని వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు నిత్యవసర సరుకులను ప్రజలకు విక్రయించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో ధరల్లో ఏమాత్రం తేడా వచ్చిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.నాణ్యత విషయంలో కూడా రాజీపడరాదని సూచించారు. కావాలని అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడరాదని స్పష్టం చేస్తూ అందులకు బాధ్యులైన వారి పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరసమైన ధరలకు నిత్యవసర సరుకులను అందించాలని సూచించారు. ప్రస్తుతం ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు కిలో 150 రూపాయలు చొప్పున, సోనామసూరి బిపిటి (స్టీమ్) బియ్యం కిలో 48 రూపాయలకు, సోనా మసూరి బిపిటి (రా) బియ్యం 47 రూపాయల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. అలాగే సన్నవర్ నూనె ప్యాకెట్లను లీటర్ 124 రూపాయలు చొప్పున, పామోలిన్ నూనె లీటర్ 114 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నామన్నారు. అదేవిధంగా అన్ని సూపర్ మార్కెట్లు, హోల్సేల్, రీటైల్ దుకాణాల్లో కూడా ప్రత్యేక కౌంటర్లు తెరచి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నిత్యవసర సరుకులను వినియోగదారులకు విక్రయించాలన్నారు. దుకాణాలను తనిఖీ చేసి తూకంలో గాని, వస్తువుల నాణ్యత లో గాని ఏమైనా తేడాలు ఉన్నాయా? సరిగా ఉన్నాయా లేదా గమనించాలని కలెక్టర్ తూనికలు కొలతల అధికారికి సూచించారు. ప్రస్తుతం రైతు బజారులో టమోటా కిలో 30 రూపాయల చొప్పున, ఉల్లిగడ్డలు కర్నూలు రకం కిలో 33 రూపాయలు చొప్పున, సోలాపూర్ రకం కిలో 42 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నామని మార్కెటింగ్ ఏడి నిత్యానందం కలెక్టర్కు వివరించారు. బహిరంగ మార్కెట్లో ఉల్లిగడ్డలు కర్నూల్ రకం కిలో 38 రూపాయలకు, సోలాపూర్ రకం కిలో 52 రూపాయలకు విక్రయించడం జరుగుతుందని కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ పార్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి,మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానందం, సి టి ఓ వి వెంకటేశ్వరరావు, తూనికలు కొలతలు సహాయ అధికారి రాజేంద్రప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, రైస్ మిల్లర్స్, రైతు సంఘాల హోల్ సేల్ రిటైల్ సంఘాల ప్రతినిధులు, బియ్యము, చక్కెర, గోధుమలు,వంటనూనెలు, దాన్యం వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్తు లక్ష్యం





(మొదటిపేజీ తరువాయి)

నారా చంద్రబాబునాయుడు గురువారం సీఆర్డీఏ పరిధిలోని తాళ్లాయపాలెం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మైలవరం విద్యుత్ ఉపకేంద్రం వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ నిధి మీనా, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్, ఆర్డీవో సిహెచ్. చైతన్య, ట్రాన్స్ కో అధికారులు పాల్గొన్నారు. అనంతరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మైలవరంలో నిర్మించిన 132/33 కె.వి విద్యుత్తు ఉప కేంద్రాన్ని 2019లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రూ.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. తిరిగి తమ ఎన్డీఏ మహాకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్ స్టేషన్ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం సంతోషదాయకమన్నారు. ఈ ఉపకేంద్రం ఏర్పాటుతో మైలవరం, జి.కొండూరు మండలాల్లో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం కలిగిందన్నారు. మైలవరం పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందుచూపుతో ఇక్కడ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో లో-ఓల్టేజి, బ్రేక్ డౌన్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. తద్వారా నాణ్యమైన విద్యుత్ ను రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ సరఫరాకు వీలు కలిగిందని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలకృష్ణ రెడ్డి, సర్పంచ్ జి. మంజుభార్గవి, ట్రాన్స్ కో ఎస్ఇ ఎ. మురళి మోహన్, ఎంపీపీ ఐ.ప్రసన్న రాణి, డిఇఇ వసంతరావు, ఏడీఇ సుధాకర్, ఎఇ రమేష్, సబ్ ఇంజనీర్ నటరాజ్, స్థానిక నాయకులు అక్కల రామ్మోహనరావు (గాంధీ), నూతలపాటి బాల కోటేశ్వరరావు, ట్రాన్స్ కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ కొరకు విద్యుత్ ప్రాజెక్టుల వర్చువల్ శంకుస్థాపన



**పెడన, మేజర్ న్యూస్ :** ఆక్వా రైతులకు రక్షణగా వారికి ఎలాంటి విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా, విమానాశ్రయ భవిష్యత్తు అవసరాలకు ముందస్తు ప్రణాళిక బద్ధంగా కృష్ణాజిల్లా పెడన, గన్నవరంలలో అధునాతన విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు ఏపీలోని పలు విద్యుత్ ప్రాజెక్టుల ప్రారం భోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రూ.48.64 కోట్లతో పెడన 132 కేవీ విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రం నిర్మాణానికి,, రూ.30.65 కోట్లతో 11/132 కెవి గన్నవరం (ఎయిర్ పోర్ట్) విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి తోటమూల విద్యుత్ ఉపకేంద్ర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమరావతి నుండి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాలో 2 సబ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించేందుకు వీలవుతుందన్నారు. పెడన, గన్నవరంలలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, వాటి ప్రయోజనాలు ముఖ్యమంత్రికి వివరిస్తూ ఇంతకుముందు మచిలీపట్నం- పామర్రు ఎక్కువ దూరం పవర్ ట్రాన్స్మిషన్ వల్ల పెడన ప్రాంతంలో ఓల్టేజ్ సమస్యలు ఏర్పడేవన్నారు. పెడన ప్రాంతంలో4 వేల మంది ఆక్వా రైతులు ఉన్నారని, లో వోల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోయి విద్యుత్తు సమస్యలు ఎదుర్కొనే వారని అన్నారు. 132 కేవి పెడన స్విచ్చింగ్ స్టేషన్ ఏర్పాటు వల్ల లో వోల్టేజ్ సమస్యలు తొలగి పోవడంతోపాటు, 54 వేల ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని అన్నారు. రానున్న రోజుల్లో మచిలీట్నం పోర్టు, ఇండస్ట్రియల్ విద్యుత్ అవసరాలకు ఈ సబ్ స్టేషన్ వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు. గన్నవరం 132 కె.వి సబ్స్టేషన్ ఏర్పాటుతో 3 మండలాల్లో 3.5 లక్షల మంది వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ విమానాశ్రయంకు ఒక ఫీడర్ కేటాయించడంతో విద్యుత్ సమస్య లేకుండా ముందుగా ప్లాన్ చేయడం హర్షనీయమన్నారు. అంతే కాకుండా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయగలుగుతామన్నారు. ప్రస్తుత భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే ప్రణాళికాబద్ధంగా సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సబ్స్టేషన్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించడం ఈ ప్రాంతంలో విద్యుత్ రంగానికి మహర్దశ అని అన్నారు. అనంతరం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుకు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాలకు లో వోల్టేజీ సమస్యల ఇబ్బందులు తొలగుతాయన్నారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెడనలో గన్నవరంలో విద్యుత్ సబ్స్టేషన్లు ఏర్పాటు వల్ల రైల్వే లైను విద్యుత్ సరఫరాకు, రాబోయే బందరు పోర్టు విద్యుత్ అవసరాలకు, భవిష్యత్తులో ఎయిర్పోర్ట్ అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యానందం, ఏపీ ట్రాన్స్కో ఎస్ఇ భాగ్యరాజ్, నడుపూరు సర్పంచ్ చీర్ల అనూష, బొడ్డు వేణుగోపాలరావు, జడ్పిటిసి అర్జ నగేష్, టిడిపి మాజీ కౌన్సిలర్లు, టిడిపి, జనసేన నాయకులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, పాల్గొన్నారు.

# బాధితులతో మర్యాదగా వ్యవహరించండి



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నార్త్ డివిజన్ పరిధిలోని నున్న పోలీస్ స్టేషన్ ను నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్లోని రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాల గురించి, ఈ పహారా బీట్ల గురించి, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చెడు నడత కలిగిన వ్యక్తులపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఇన్స్పెక్టర్ కి పలు సూచనలు ఇచ్చారు. ఎవరైనా తప్పు చేస్తే సహించేది లేదని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం, సోషల్ మీడియా ద్వారా ఇతరులను వేధించడం, పరువు ప్రతిష్టలకు భంగం కలిగేవిధంగా చేయకూడదని, అట్లు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ సిబ్బందితో మాట్లాడుతూ..... స్టేషన్ కు వచ్చిన బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలియజేశారు. పెండింగ్ కేసులను తగ్గించాలి అని, బీట్స్ బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై దృష్టి సారించాలని, సైబర్ నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అదేవిధంగా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి వాటి పై పూర్తిస్థాయి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. నిర్మానుష ప్రదేశాలు, పరిసర ప్రాంతాలలో తిరుగు అనుమానస్పద వ్యక్తులపై, గంజాయి విక్రయం, సేవించు వ్యక్తుల పైన అదేవిధంగా చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చెయ్యాలని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నున్న ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

# మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల పురోగతి, భూ సమస్యలపై సమీక్షించారు. ఈ క్రమంలో ఆయన పోర్టు నిర్మాణ దశల్లోని విభాగాల వారీగా పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రెడ్జింగ్, నార్త్ సౌత్ బ్రేక్ వాటర్, బెర్తులు, రోడ్ కం రైల్, నీటి సరఫరాకు పైప్ లైన్, పరిపాలన భవనాలు తదితర నిర్మాణాల పనులను ఎప్పటిలోగా పూర్తి చేసేది కార్యాచరణ ప్రణాళికను అధికారులు కలెక్టర్కు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 2025 నాటికి పోర్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి పెట్టి ఆ సమయానికి పూర్తి చేయాలన్నారు. పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అధిక మొత్తంలో అవసరమైన యంత్రాలు, మ్యాన్ పవర్ ఉపయోగించాలని ఆయన అధికారులకు సూచించారు. పనుల పురోగతిని పరిశీలించేందుకు త్వరలో పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శిస్తానన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ డీఆర్ఓ శ్రీదేవి, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ డీఈఈ ఎం శివయ్య, రైట్స్ టీం లీడర్ అధికారులు, బందరు ఆర్డిఓ కే స్వాతి, రోడ్లు భవనాల శాఖ ఈఈ లోకేష్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజ్, తహసిల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయండి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వైసిపి అభిమాని బడే గౌతం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆయా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన వెంటనే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని కల్పించిన విధంగా మన రాష్ట్రం లో కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికైనా మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణాన్ని కల్పించాలి. అధికార పార్టీ శాసనసభ్యులు, నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వత్తిడి తెచ్చి ఇచ్చిన హామీ మేరకు గతుకులు లేని రోడ్డులో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

## జిల్లాస్థాయి పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రథమ స్థానం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ ఏసీబీ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ మచిలీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవాసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి రేఖా రాణి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవాసం చేసుకున్నారని,ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బి నాగ సౌమ్య ప్రథమ స్థానం జి పున్నమి నాగజ్యోతి ద్వితీయ స్థానం వక్తృత్వ క్టపోటీలలో సిహెచ్ సాయి కృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు విజేతలకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ పక్షాన సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో నాగరాజు, సుబ్బారావు, సాయికుమార్ అన్నపరెడ్డి శ్రీనివాసరావు, దిలీప్లతో పాటు అధ్యాపకులు విజేతలను అభినందించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గాడిపర్తి కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి



**నందిగామ, నవంబర్ 7, మేజర్ న్యూస్ :** పట్టణ శివారు హనుమంతుపాలెంలో ప్రముఖ కాంట్రాక్టర్ గాడిపర్తి రామకృష్ణ, పాత్రికేయులు గాడిపర్తి రాజ తండ్రి గాడిపర్తి కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నందిగామ పట్టణ ప్రముఖులు పాల్గొని కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## గుండెపోటుతో టీడీపీ కుటుంబ సభ్యుని మృతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, యువ కార్యకర్త కర్ల సాయి కుమార్ (23) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు గురువారం మధ్యాహ్నం మూలపాడు గ్రామంలోని వారి నివాసానికి విచ్చేసి సాయికుమార్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్థీవదేహంపై పార్టీ జెండాను కప్పారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. టీడీపీ యువ కార్యకర్త సాయికుమార్ మృతి చాలా బాధాకరమని అన్నారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో సాయిచంద్ జన్మదిన వేడుకలు




**నందిగామ, నవంబరు 7, మేజర్ న్యూస్ :** తెలుగు యువత నాయకులు ఉన్నం సాయి చందు జన్మదిన వేడుకలు తిరుమలలో కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి చందు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా కుటుంబ సభ్యులందరితో కలిసి జన్మదిన వేడుకలను కలియుగ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం టిటిడి చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన బి ఆర్ కె నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కడియాల చిన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవినేని ఉమ



**నందిగామ, నవంబర్ 7, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని వీరులపాడు మండలం పొన్నవరం గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కడియాల నరసింహారావు (చిన్నా) కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. చిన్న తల్లి సుశీల దేవి అకాల మరణం చెందగా గురువారం నాడు పొన్నవరం వారి స్వగృహమునందు సుశీల దేవి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.




## ఐకానిక్ ఆహార శ్రేణిని అందుబాటులోకి తీసుకువచ్చిన కేఎఫ్సీ

**విజయవాడ మేజర్ న్యూస్ :** తమ తాజా క్యాంపెయిన్లో కూడా కేఎఫ్సీ టేస్ట్ ది ఎపిక్ అని చెబుతోంది. దాదాపు మూడు దశాబ్దాలుగా, కేఎఫ్సీ ఫింగర్ లికిన్ చక్కని క్రిస్పీ చికెన్తో దేశవ్యాప్తంగా అభిమానులను ఆనందపరుస్తోంది. ఈ నవంబరులో కేఎఫ్సీ అత్యధికంగా విక్రయం అవుతున్న తన ఆహార ఉత్పత్తుల శ్రేణితో వేడుక చేసుకునేందుకు ఫ్యాన్ ఫ్యావెరెట్స్- ఐకానిక్ హాట్, క్రిస్పీ చికెన్, హాట్ వింగ్స్ నుంచి బోన్లెస్ చికెన్ పాప్కార్న్, పెరి-పెరి బోన్లెస్ చికెన్ స్ట్రిప్స్, వివిధ రకాల జింగర్ బర్గర్లు, రోల్స్, మరెన్నింటినో అందుబాటులోకి తీసుకువచ్చింది. భారతదేశ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు కేఎఫ్సీసిగ్నేచర్ మెను ఐటెమ్ల అత్యుత్తమ రుచి, సాటిలేని క్రంచ్తో టేస్ట్ ది ఎపిక్ రుచిని ఆస్వాదించవచ్చు.

## సామ్సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6లపై పండుగ ఆఫర్లు




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్, తమ అత్యంత ప్రజాదరణ పొందిన ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్ఫోన్లు గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6పై అద్భుతమైన రీతిలో పరిమిత కాల ఆఫర్లను ప్రకటించింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ని కొనుగోలు చేసే వినియోగదారులు 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో పాటుగా రూ. 1,44,999 కంటే తక్కువ ధరకే స్మార్ట్ఫోన్ను పొందుతారు. అదేవిధంగా, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6ని కొనుగోలు చేసే వినియోగదారులు పరిమిత కాలపు పండుగ ఆఫర్లో భాగంగా 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో పరికరాన్ని కేవలం రూ. 89,999కి పొందుతారు. గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6ను రూ. 2500 నుండి, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ను రూ. 4028తో ప్రారంభమయ్యే సౌకర్యవంతమైన ఈఎంఐ అవకాశాల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

## భారతదేశంలో అమెజాన్ క్రియేటర్ సెంట్రల్ ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో క్రియేటర్ సెంట్రల్ను ప్రారంభించినట్లు అమెజాన్.ఇన్ ప్రకటించింది. ఇది కంటెంట్ క్రియేటర్లను శక్తివంతం చేయడానికి రూపొందించబడిన ఒక సమగ్ర వేదిక. కంటెంట్ సృష్టి ప్రక్రియను క్రియేటర్ సెంట్రల్ క్రమబద్ధీకరిస్తుంది. సాంకేతిక సంక్లిష్టతలపై కాకుండా క్రియేటర్లు తమ సృజనాత్మకతపై దృష్టి పెట్టేందుకు వీలుగా సులభంగా తెలుసుకునే వర్క్ఫ్లోలు, అంకితమైన స్టోర్ ను అందజేస్తుంది. క్రియేటర్ సెంట్రల్తో, కంటెంట్ క్రియేటర్లు అమెజాన్.ఇన్లో తమ కంటెంట్ను సులభంగా ఉత్పత్తి చేయడంతో చేసి, ప్రచారం చేస్తూ లక్షలాది మంది షాపర్లను చేరుకోవచ్చు. క్రియేటర్ సెంట్రల్ తదుపరి కొన్ని వారాల్లో అమెజాన్ ఇన్ఫ్లుయెన్సర్ ప్రోగ్రామ్తో అనుబంధించబడిన 50 వేల మంది క్రియేటర్లకు అందించబడుతుంది.

## శ్రీ సత్తమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు



**నందిగామ, నవంబర్ 7, మేజర్ న్యూస్ :** మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం హుండీలను తెరిచి నగదును లెక్కించగా 90 రోజులుగాను రూ.8,00,078లు (అక్షరాల ఎనిమిది లక్షల డెభ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే). ఈ లెక్కింపు నందిగామ డివిజన్ ఇన్స్పెక్టర్ జి.పవన్ కళ్యాణ్, ఆలయ మాజీ చైర్మన్ చుండు శ్రీనివాస రావు, సత్యసాయి సేవాదళ్ సభ్యుల సమక్షంలో లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ కార్యనిర్వాహణ అధికారి గెల్లి, హరి గోపీనాథ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

# జోగి రమేష్ వల్ల మైలవరం ప్రజలకు ఏం ఒరిగింది?




'ఎట్లా కన్నావమ్మా జగన్మోహన్ రెడ్డిని' అని వ్యాఖ్యానించిన వ్యక్తి జోగి రమేష్

సొంత కులస్తుల నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి జోగి రమేష్

వీటిపిఎస్ బూడిదను, సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులను సైతం అమ్ముకున్నాడు

బిల్లులు చేసేందుకు వైసీపీ నేతల కమిషన్లు తీసుకున్నాడు

సొంత బాబాయ్ దగ్గర కూడా కమిషన్ తీసుకున్నాడు

సభ్యత గురించి మాట్లాడే నైతిక హక్కు జోగి రమేష్‌కు లేదు

శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంత్రిగా వెలగబెట్టిన జోగి రమేష్ వల్ల మైలవరం నియోజకవర్గ ప్రజలకు ఏం ఒరిగిందంటూ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట ప్రసాదు ప్రశ్నించారు మైలవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ను గురువారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ జోగి రమేష్ అనే వ్యక్తి గొంగళి పురుగు లాంటి వ్యక్తి అన్నారు. అతని గురించి ఆలోచించినా, మాట్లాడినా తన స్థాయి తగ్గించుకున్నట్లే అన్నారు. జోగి రమేష్ ప్రేలాపనలు, 2024 ఎన్నికల ముందు, తాజాగా మైలవరంలో మాట్లాడిన వ్యాఖ్యల గురించి ప్రజలందరూ గమనిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. జోగి రమేష్ తన మాటల్లో చెడ్డీ కొట్టుకుని, లాగు వేసుకొని మైలవరం నియోజకవర్గంలో తిరుగుతున్నట్లు చెబుతున్నాడని, అతని వల్ల మైలవరం నియోజవర్గానికి ఏం జరిగిందని ప్రశ్నించారు. మంత్రి ఒక ఊరికో, ఒక నియోజకవర్గానికే మంత్రి కాదన్నారు.ఎప్పుడు లేని విధంగా గత 40 ఏళ్ల చరిత్రలో వీటిపిఎస్ బూడిదకు కౌంటర్లు పెట్టి మరి అమ్ముకున్న చరిత్ర జోగి రమేష్‌ది అని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల దగ్గర, వైసీపీ శ్రేణులు వద్ద డబ్బులు దండుకున్నది జోగి రమేష్ అని ఆరోపించారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ కేడర్‌కు బిల్లులు చెల్లించాడానికి 20 నుంచి 30 శాతం కమిషన్లు దండుకున్న వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. 2019లో మైలవరం వైసీపీ సీటు త్యాగం చేశాడో, అమ్ముకున్నాడో మైలవరం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. మరి పెడనలో సీటు త్యాగం చేసిన వ్యక్తికి నువ్వే న్యాయం చేసామని జోగి రమేష్ ను ప్రశ్నించారు. 2024లో నువ్వు పోటీ నియోజకవర్గంలో నీకు ఎందుకు సీట్ కేటాయించలేదని, మళ్లీ వేరే నియోజకవర్గంలో నీకు ఎందుకు సీటు ఇవ్వాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అతీగతీ లేక పెనమలూరులో జోగి రమేష్‌ను వైసీపీ నిలబెడితే జిల్లాలోనే అత్యంత భారీ ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశాడని పేర్కొన్నారు.ఎన్టీఆర్ జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో మైలవరం నియోజకవర్గ చరిత్రలో అత్యంత భారీ మెజారిటీతో గెలిచిన వ్యక్తిని తను అని పేర్కొన్నారు.కొత్తగా సభ్యత గురించి జోగి రమేష్ పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జోగి రమేష్ నుంచి ఈ రాష్ట్రంలో సభ్యత, సంస్కారం గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు. జగన్మోహన్ రెడ్డిని తాను ఎప్పుడు ఏకవచనంతో సంభోదించలేదన్నారు. కానీ 2009లో గెలిచిన జోగి రమేష్ అప్పట్లో జగన్మోహన్ రెడ్డిని ఎట్లా కన్నావమ్మా విజయమ్మ అంటూ అసెంబ్లీలో ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో జోగి రమేష్...వైఎస్ రాజశేఖర్ రెడ్డి శిష్యుడు అని గుర్తు లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. జోగి రమేష్ నైజం అయిన కాడికి దోచుకోవడం అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనాపరమైన విధానాలు తనకు నచ్చక తను పోటీ చేయడానికి చెప్పానని పేర్కొన్నారు.జోగి రమేష్ లాంటి నయవంచకుని మాటలు విని 151 అసెంబ్లీ స్థానాల నుంచి 11 స్థానాలకు వైసీపీ దిగజారిపోయిందన్నారు. ఇదే విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి అంతర్మథనం చేసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జోగి రమేష్ కు మంత్రి పదవి రాకముందు జగన్మోహన్ రెడ్డి గురించి ఏమేమి వ్యాఖ్యలు చేశారో తమకు అందరికి తెలుసన్నారు. ఎన్నికల అనంతరం కూడా పెనమలూరులో జోగి రమేష్‌కు ఎన్నికల నిధులు తక్కువ ఇచ్చారని జగన్మోహన్‌రెడ్డిని దూషించారని అన్నారు. రెండు మాసాల క్రితం జనసేన పార్టీలో చేరేందుకు పవన్ కళ్యాణ్ కార్యాలయం చుట్టూ తిరిగిన విషయం కూడా ఈ ప్రాంత ప్రజలకు అందరికీ తెలుసన్నారు.సబ్‌స్టేషన్లో ఉద్యోగం నిమిత్తం జి.కొండూరు చెందిన నిరుద్యోగి, సొంత కులస్తుడి నుంచి రూ.7 లక్షలు వసూలు చేసిన ఘన చరిత్ర జోగి రమేష్ అని అన్నారు. మిగతా ఉద్యోగాల నుంచి కూడా లక్షలు వసూలు చేశాడని అన్నారు.జోగి రమేష్ చేసిన వెకిలి చేష్టలు, లేఖి చేష్టలు ప్రజలందరికీ తెలుసు అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులు ఎత్తి చూపానన్నారు. తను విధానపరమైన విమర్శలు చేశాను తప్పితే, ఎప్పుడూ అసభ్యకర పదజాలం వాడలేదన్నారు. నియోజవర్గంలో వరదలు వచ్చి ప్రజలందరూ ఎంతో ఇబ్బందులు పడుతుంటే కనీసం మానవీయ సాయం కూడా వీసమెత్తు చేయకుండా, కనీసం భరోసా కూడా ఇవ్వలేదన్నారు. మళ్లీ తాజాగా మైలవరం లో తగుదునమ్మా అంటూ అడుగుపెట్టి గతం గురించి మాట్లాడవద్దని చెబుతున్నాడని పేర్కొన్నారు. తను ఎటువంటి వ్యక్తినో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా తను వ్యవహరిస్తానని, అరిచే కుక్క కరవదు అని, కరిచే కుక్క అరవదు అని అన్నారు. జోగి రమేష్ అనే వ్యక్తి ఇక శాసనసభలో శాశ్వతంగా అడుగు పెట్టడని పేర్కొన్నారు.జోగి రమేష్ నోటికి అడ్డూ అదుపు లేదన్నారు. మళ్ళీ తట్టా బుట్ట సర్దుకుపోయిన వ్యక్తికి ఇప్పుడు ఇన్ని ఆస్తులు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించారు. విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నాడని, హైదరాబాదులో కూడా భూములు కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. అక్రమంగా భూములు కుమారుని పేరున పెట్టి అతడిపై కేసులకు జోగి రమేష్ కారకుడయ్యాడన్నారు. తన సొంత బాబాయ్ దగ్గర కూడా కమిషన్లు వసూలు చేసి గతంలో వైసీపీ ప్రభుత్వం నుంచి రాయితీలు ఇప్పించాడని పేర్కొన్నారు. చిరు ఉద్యోగుల నుంచి, బూడిద, ఇసుక, మట్టి నుంచి కూడా కౌంటర్లు పెట్టి మరీ సొమ్మును దండుకున్నాడని పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ దొంగలు తిరిగి వస్తున్నారని శాసనసభ్యులు కృష్ణప్రసాదు అన్నారు.

## కొత్త ఐపిపిబి ఖాతాలను తెరిచేందుందుకు ఈ నెల 15వరకు ప్రత్యేక శిబిరాలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** తపాలా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ద్వారా కొత్త ఖాతా లను తెరవడం, ఆధార్ లింకేజీని సులభతరం చేయడానికి 15 నవం బర్ 2024 వరకు క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్నట్లు గురువారం ఆంధ్రప్రదేశ్ సర్కిల్, చీఫ్ పోస్ట్ మా స్టర్ జనరల్ కె.ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. కొత్త ఐపిపిబి బ్యాంక్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ఖాతాలకు ఆధార్ను లింక్ చేయడం, ఎన్ పిసిఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మ్యాపింగ్‌ను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమని తెలియజేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 64.81లక్షల ఖాతాలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 వేల పై చిలుకు పోస్ట్ ఆఫీసుల ద్వారా పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు.

**ప్రయోజనాల ముఖ్యమైన వివరాలు:**

**అర్హత:** 18 సంవత్సరాల పైబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పౌరులు.

**లక్ష్యం:** 64,81,632 నిరుపయోగంలో ఉన్న ఖాతాలను పునరుద్ధరించడం.

**గడువు:** అన్ని ఖాతాలు నవంబర్ 15నాటికి పునరుద్ధరించబడతాయి.

ఈ ప్రత్యేక క్యాంపులు, అర్హులైన పౌరులందరికీ ఆర్థిక సాధికారత, ప్రభుత్వ ప్రయోజనాలను సజావుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయబడేలా పోస్టల్ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కలిసి పనిచేయనున్నాయన్నారు. మరింత సమాచారం కొరకు లబ్దిదారులు తమ దగ్గరలో ఉన్న పోస్ట్ ఆఫీసును సంప్రదించగలరని తెలిపారు.

## క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ డీఎంఎచ్ఓ జి గీతాబాయి జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. వైద్య శాఖ ఉద్యోగులు కాన్సర్ పై విజయం ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుండి రక్షణ ప్లే కార్డులను ఉపయోగించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు, ఆశాలు, వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ఈ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.



## దీపం -2పథకంతో మహిళలలో వెల్లు విరిసిన ఆనందం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సూపర్-6 హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన దీపం-2 సంవత్సరనికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితంగా ఇచ్చు హామీ నిలబెట్టుకోవడంతో మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 39వ డివిజలో మహిళలు డివిజన్ ఇన్చార్జ్ కట్టా అంజిబాబు అధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, ఎ.పి.యస్. ఆర్.టి.సి ఛైర్మెన్ కోనకళ్ళ నారాయణరావుల చిత్రపటలకి పాల అభిషేకం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గంధ్రాలయ చెర్మెన్ గోరెపాటి గోపీచంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకోఒక్కటిగా అమలు చేస్తూ ప్రజలందరి చేత ఇది మన మంచి ప్రభుత్వం అని మన్నలు పొందుతూదన్నారు. అలాగే సంక్రాంతి నుండి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి సూపర్6 లో ఇచ్చిన హామీల అమలుకు ఈ ప్రభ్వుతం కట్టుబడి ఉందన్నారు.నగర తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిపళ్ళ వెంకన్న మాట్లాడుతూ దీపం-2 తో ప్రతి కుటుంబానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ భారత దేశ చరిత్రలోనే ఆంధ్రపదేశ్ లో మాత్రమే కూటమి ప్రభుత్వం చేస్తుందని కొనియాడారు.39 వ డివిజన్ ఇన్చార్జ్ కట్టా అంజిబాబు మాట్లాడుతూ దీపం-2 పథకంమే కాకుండా దేవాలయలో పనిచేసే అర్చుకులకు 5000 నుండి 15000 జీతం పెంచిన చంద్రబాబుకి, పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 39 వ డివిజన్ జనసేన పార్టీ ఇన్చార్జ్ నరహరశెట్టి రామ్ బిజెపి డివిజన్ ఇన్చార్జ్ దూళిపాల శ్రీ రామ చంద్ర మూర్తి 40 వ డివిజన్ ఇన్చార్జ్ రాజులపాటి నాగబాబు, జనసేన నాయకులు వంపుకడవల చౌదరి, డివిజన్ నాయకులు మెట్టు సూరిబాబు, గాదె శ్రీనివాస శర్మ, పామర్తి వెంకటేశ్వరరావు, మురాల శ్రీనివాసరావు, మెట్టు పూర్ణ, కొండేటి సుబ్రమణ్యం, ఎద్దు సితారామ్, జనసేన నాయకులు సుదర్శన్ పాండు, కుమారి డివిజన్ లో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా రోడ్డు మరమ్మత్తు పనులు





**నందిగామ, నవంబర్ 7, మేజర్ న్యూస్ :** గత నెలలో వచ్చిన తుఫాను వరదలు కారణంగా పాడైపోయిన వత్సవాయి చెవిటికల్లు రోడ్డు కూడలి దోమలూరు వద్ద పూర్తిగా కొట్టుకుపోయి ప్రధానంగా వీరులపాడు నందిగామ మండలాలు కలిపే ఈ రోడ్డు మరమ్మత్త పనులుకు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య), మాజీ మంత్రి నెట్టెం రఘురాం, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని శివనాద్(చిన్ని) కోరిక మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఆర్ అండ్ బి అధికారులు మరమ్మత్తు పనులకు రూ.50లక్షల నిధులు మంజూరు చేసి ఉన్నారు. మరమత్తు పనులు మూడు రోజుల నుండి శరవేగంగా జరుగుచున్నవి పనులు పరిశీలించి ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ఎన్డీఏ ప్రభుత్వానికి నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరస్వామిన్, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు మన్నే కళావతి, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోటనాగమల్లేశ్వరరావు (బుజ్జి) తొర్రగుడిపాడు సర్పంచ్ చెరుకూరు హైమారావు, సీనియర్ నాయకులు తొర్రగుడిపాడు మాజీ సర్పంచ్ చెరుకూరు సాంబశివరావు, చెరుకూరు నరసింహారావు(గాంధీ) దోమలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా తులసిరావు,గింజుపల్లి శ్రీనివాసరావు,నేలవెల్లి సిద్ధార్థ, గాదెల వీరబాబు, వడేబోయిన నరసింహరావు, బత్తుల గోపి, గాదె పుల్లారావు, బలమల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే గర్వకారణం స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మహాత్మాగాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత్ ఆశయాన్ని ఆచరణలో చూపుతున్న గ్రామం చల్లపల్లి. గాంధీ స్ఫూర్తితో దాదాపు పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోడీ భారతీయులకు ఇచ్చిన నినాదం స్వచ్ఛ భారత్. ఆనాడు ప్రధాని మోడీ చీపురు పట్టుకొని వీధులు శుభ్రం చేయటం చూసిన సెలబ్రిటీలు, కార్పొరేట్ దిగ్గజాలు, బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ దిగ్గజాలు మేముసైతం అంటూ చీపురు పట్టి జై స్వచ్ఛ భారత్ అంటూ నినదించారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ల పేరుతో ఎంతోమంది క్రీడాకారులు, సినీ నటులు ఒక ఏడాది హడావిడి చేశారు. కానీ ఆరోజు ప్రధాని మోడీ పిలుపు అందుకుని ఒక గ్రామంలో చీపురు పట్టుకున్న చేతులు నేటికి పదేళ్లుగా శ్రమిస్తూనే ఉన్నాయి. మహాత్మాగాంధీ ఆశించిన స్వచ్ఛ భారత్ సాకారానికి స్వయంగా విద్యావంతులు సుమారు పదేళ్లుగా శ్రమిస్తున్న ఏకైక గ్రామం కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని చల్లపల్లి. వైద్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు తెల్లవారుజామున 4:30 నుంచి ఉదయం 6:30 వరకూ గ్రామ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న ఏకైక గ్రామంగా దేశంలోనే చల్లపల్లి గ్రామం ప్రత్యేక స్థానం సాధించింది. డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతి దంపతులు శ్రమదానంతో పాటు గ్రామ పరిశుభ్రతతో పాటు అభివృద్ధికి ఉదారంగా తమ స్వంత డబ్బు ఖర్చు పెట్టడంతో చల్లపల్లి గ్రామం అనేక హంగులు సంతరించుకుంది. వారి ఉదారతకు దాతల ప్రోత్సాహం కూడా కొంతమేరకు తోడు కావటంతో చల్లపల్లిలో కీలక అభివృద్ధి పనులు సాకారమయ్యాయి. ప్రధానంగా చల్లపల్లిలో ప్రధాన రహదారి పక్కన అత్యంత సమస్యాత్మకంగా ఉన్న గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక రూపురేఖలు మారిపోయాయి. డాక్టర్ డీ.ఆర్.కే. ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల అవిశ్రాంత శ్రమ, దాతల సహాయంతో డంపింగ్ యార్డ్, హిందూ స్మశాన వాటిక సుందరమైన గార్డెన్, లాన్, అధునాతన సౌకర్యాలతో నందనవనాలుగా దర్శనమిస్తున్నాయి. గ్రామ పరిశుభ్రతకు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ ప్రాధాన్యత ఇస్తే, డాక్టర్ టీ.పద్మావతి గ్రామ సుందరీకరణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ చల్లపల్లికి స్వచ్ఛ భారత్ అంశంలో దేశంలోనే ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు గత పదేళ్లుగా అనితర సాధ్యమైన శ్రమను, ధనాన్ని వెచ్చించి కృషి చేస్తున్నారు. వారిద్దరి సంకల్పం ఫలితంగా చల్లపల్లి గ్రామానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక గుర్తింపులు, గౌరవాలు లభిస్తున్నాయి. తాజాగా చల్లపల్లి ఒకటో వార్డులోని హిందూ స్మశాన వాటికను పూర్తి స్థాయిలో సకల హంగులతో తీర్చి దిద్దేందుకు డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతి లక్షలాది రూపాయల వ్యయంతో దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డాక్టర్ పద్మావతి పాత్ర కీలకం: డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ కొద్దిమంది కార్యకర్తలతో చేపట్టిన స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం మొదట పారిశుధ్య సేవలతో కొనసాగుతున్న దశలో ఆయన సతీమణి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ పద్మావతి రాకతో స్వచ్ఛ సుందర చల్లపల్లిగా విస్తృత సుందరీకరణ, అభివృద్ధి దిశగా పురోగమిస్తోంది. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం పదేళ్ల ప్రస్థానంలో ఎన్నో పేరు ప్రఖ్యాతులు సాధించింది. తెల్లవారుఝామునే దాదాపు యాభై మంది విద్యావంతులు ఊరి బాగు కోసం శ్రమదానం చేయటం ఎంతో స్ఫూర్తిదాయకం కదా. పండుగ రోజు ఆదివారం రోజు అని ఆలోచించకుండా ప్రతి రోజు పొద్దున్నే గ్రామం కోసం రెండు గంటలు శ్రమిస్తున్న తీరు చల్లపల్లి గ్రామ ఖ్యాతిని ఎంతో మంది ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. కేంద్ర పట్టణాభివృద్ధి హోదాలో ఉన్న సమయంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల శ్రమదాన సంస్కృతిని ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత టీడీపీ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలోనూ రాష్ట్ర స్థాయి స్వచ్ఛతే సేవా సభలకు ఆహ్వానించి స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతిలను ప్రశంసించారు. అంతేకాకుండా ఆరేళ్ళ క్రితమే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు స్వయంగా చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామం కోసం డీఆర్కే దంపతులు, స్వచ్ఛ కార్యకర్తల, గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గం, పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషిని పరిశీలించి అభినందించారు. ప్రముఖ సినీ గాయకులు స్వర్గీయ బాల సుబ్రహ్మణ్యం, సినీ పాటల రచయిత, గాయకుడు చంద్రబోస్, వందేమాతరం శ్రీనివాస్ ఇంకెందరో ప్రముఖులు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రశంసలు కురిపించారు. స్వచ్ఛ చల్లపల్లి గ్రామ అభివృద్ధికి డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతి తమ స్వంత డబ్బు లక్షలాది రూపాయలు వెచ్చించి చేస్తున్న ఈ స్వచ్ఛ సేవకు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏవీ గురువారెడ్డి, శాంతా బయోటెక్ ఎండీ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, డాక్టర్ డీ.శివప్రసాద్, ఇంకా డీఆర్కే దంపతుల స్నేహితులు, సహ వైద్యులు, మరెందరో ఈ కార్యక్రమం కోసం విరాళాలు అందచేశారు. గ్రామాన్ని పరిశుభ్రతగా ఉంచటంతో పాటు అభివృద్ధి పథంలో పయనించటం కోసం స్వచ్ఛ సుందర చల్లపల్లి బృందం శ్రమ వెలకట్టలేనిది. డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ – డాక్టర్ టీ.పద్మావతి దంపతులు గత పదేళ్లుగా లక్షలాది రూపాయలు స్వంత డబ్బు ఖర్చు పెట్టి ఈ పారిశుధ్య సహిత గ్రామాభివృద్ధి మహాయజ్ఞాన్ని నిర్విఘ్నంగా, నిర్విరామంగా నిర్వహిస్తున్నారు.








# యోగ పోటీల్లో జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర, జాతీయ స్థాయి యోగ పోటీల్లో బాగా రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. డి ఎస్ డి ఓ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 7 మందిలో మచిలీపట్నం నగరం నుండి 5 మంది యోగా సాధకులు రమేష్, మధు,శ్రీనివాసు, స్వర్ణలత, సునంద ఎంపిక కాగా గురువారం ఉదయం నగరంలోని గాంధీనగర్ ఉదయపు నడక మిత్రమండలి భవనంలో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలని అక్కడ కూడా బాగా రాణించి యోగ పోటీలో నెగ్గాలని జిల్లా కలెక్టర్ అభిలషించారు.

అలాగే యోగా గురువు గురునాథ్ బాబు యోగ సాధకులను అభినందిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి బహుమతులు సాధించాలని యోగ సాధకులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి పృథ్వి యోగ గురువులు సతీమణి మహాలక్ష్మి, యోగ గురువులు ముదిగొండ శాస్త్రి, యోగా సాధకులు విద్యుత్ శాఖ నోడల్ అధికారి భాస్కరరావు, సమాచార పౌర సంబంధాల శాఖ ఎం.వెంకటేశ్వర ప్రసాద్, ఆర్ డి ప్రసాద్ తదితర యోగ సాధకులు పాల్గొన్నారు.

## మూడు వేల మంది భక్తులకు అన్న ప్రసాదాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పవిత్ర కార్తీకమాసంలోని మొదటి గురువారాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేట రోడ్ లోని శిరిడి దివ్య సాయి మందిరంలో భారీ అన్న సంతర్పణ చేసారు. ఈ సందర్భంగా బాబా వారిని విశేషంగా అలంకరించి,ఆవుపాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించి వడ్డన చేశారు. ఆలయ ధర్మకర్త మండలి సత్య ప్రసాద్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 3,000 మంది భక్తులు తరలివచ్చి బాబా వారిని దర్శించుకుని బాబా వారికి అత్యంత ప్రీతికరమైన విష్ణు సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించారు. సాయంత్రం బాబా వారికి భజన తదుపరి పల్లకి మహోత్సవ నిర్వహించగా భక్తులు భారీగా పాల్గొన్నారు మధ్యాహ్నం నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ అన్న ప్రసాదాలను స్వీకరించారు.

## పంచారామాలకు ప్రత్యేక సర్వీసు




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కార్తీక మాసం పర్వదినాలను పురస్కరించుకుని అవనిగడ్డ డిపో నుండి పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. కార్తీక పర్వదినాల్లో భాగంగా 9వ తేది శనివారం రాత్రి 12 గంటలకు అవనిగడ్డ డిపో నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందని. ప్రముఖ దైవ క్షేత్రాలైన అమరావతి,భీమవరం,పాలకొల్లు, దాక్షారామం, సామర్లకోట క్షేత్రాలైన పంచారామాలు సందర్శించి మరుసటి రోజు రాత్రికి తిరిగి అవనిగడ్డ చేరుతుందని, ఈ స్పెషల్ బస్ నకు చార్జీ ఒక్కొక్కరికి రూ.1245 లుగా నిర్ణయించినట్లు వివరించారు. టికెట్లను ఆన్లైన్లో గాని, రిజర్వేషన్ కౌంటర్ ద్వారా గాని పొందవచ్చునని ముందు సీట్లు కావలసినవారు వెంటనే రిజర్వేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 9959225466, 7382925700 నెంబర్లకు, రిజర్వేషన్ కొరకు 7036335079 నెంబర్ కు ఫోన్ చేయాలని కోరారు.

## విభిన్న రంగాల్లో 'నోబెల్ ' ఖ్యూరి కె సొంతం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం లలో నోబెల్ పురస్కారం పొందిన ఏకైక మహిళా మేడం ఖ్యూరి అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ అకాడమి, కృష్ణా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మేడం ఖ్యూరి, సర్ సివి రామన్, ఆచార్య ఎన్జి రంగా జయంతి సందర్భముగా వారి చిత్ర పటాలకు పులమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యం తో కూడిన ఉన్నత విద్య వుంటేనే పరిశోధనలు వస్తాయి అని చెప్పారు. యువశక్తి మన దేశానికి పెద్ద ఆస్తి అన్నారు. ఆచార్య సుందర కృష్ణ, ఆచార్య మారుతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, పరీక్షల నియంత్రణ అధికారి డా. వీర బ్రహ్మచారి, డా. రాజశేఖర్ రెడ్డి, పలువురు సహాయ ఆచార్యులు, రాష్ట్ర సైన్స్ అకాడమి సిబ్బంది, పాల్గొన్నారు.

## యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులుగా రవీంద్రబాబు, రత్నగిరి




మొవ్వ (నవంబర్ 7) మేజర్ న్యూస్: మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రవీంద్రబాబు, ఎం రత్నగిరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు చల్లపల్లి క్రాంతి జూనియర్ కళాశాలలో జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం రత్నగిరి, గౌరవ అధ్యక్షులుగా పాగోలు రమేష్ బాబు ఉపాధ్యక్షులుగా వై సతీష్, నిర్మల, కోశాధికారిగా కే.శివ నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ మొవ్వ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నికైన ఎం రవీంద్రబాబు, ఎం రత్నగిరిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. తమని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సహోపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు పామర్రు హైస్కూల్ విద్యార్థులు ఎంపిక



పామర్రు నవంబర్ 7 మేజర్ న్యూస్ : పామర్రులోని శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ. ఇందిరా రాణి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇంగువ రవి అండర్– 17 జట్టుకు, అలాగే తొమ్మిదవ తరగతి విద్యార్థిని దేవి విశాలాక్షి అండర్– 17 బాలికల జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 22వ తేదీన కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణా జిల్లా తరపున రగ్బీ ఆటలో ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆమె తెలిపారు. అంతేకాక ఇంగువ రవి బేస్బాల్ జిల్లా జట్టుకు ఎంపిక అయ్యాడని ఇరవై ఎనిమిది ఈనెల 8న గుంటూరులో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ అధ్యాపకులు జి.మురళి, రవి కిషోర్‌లను ఆమె అభినందించారు.

## నేత్ర దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన మహిళ



పామర్రు నవంబర్ 7 మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పామర్రు కు చెందిన ఒక మహిళ తాను చనిపోతూ తన రెండు నేత్రాలను దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. పామర్రు 14వ వార్డులో కొత్తపేట స్కూల్ పక్కన నివాసం ఉంటున్న కొల్లి ఉమాపతి (85) అనే మహిళ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా తన కళ్లను దానం ఇచ్చేందుకు నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థ ద్వారా ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసేందుకు అంగీకార పత్రాన్ని గతంలో ఇచ్చారు. దీంతో ఆమె మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులు వారికి తెలపడంతో ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి కి చెందిన టెక్నీషియన్ సాయి ఆమె నేత్రాలను సేకరించారు. డాక్టర్ సురేష్ రెడ్డి ప్రోత్సాహంతో మానవత సేవా సంస్థ ప్రతినిధి తలశిల రఘుశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంస్థ ద్వారా చేస్తున్న నేత దానాలలో ఇది 213వ దానమని తెలిపారు. ఈ సందర్భంగా నేత్ర దానం చేసిన ఉమావతి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

## క్షణికావేశంలో భార్యను హత్య చేసిన భర్త



పామర్రు నవంబర్ 7 మేజర్ న్యూస్ : పామర్రు నియోజకవర్గ పరిధిలోని పెదపారుపూడి మండలంలో క్షణికావేశంలో భార్యపై దాడి చేసి భర్త హత మార్చిన సంఘటన గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం పెదపారుపూడి మండల పరిధిలోని దూళ్ళవాని గూడెం లో తనకు తెలియకుండా కుమార్తెకు గ్యాస్ సిలిండర్ ఇచ్చిందనే కోపంతో వేమూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తన భార్య జయమ్మ (67)పై దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తన తండ్రి దాడి చేయడంతోనే తల్లి మరణించిందని వేమూరు వెంకటేశ్వరరావు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పెదపారుపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఆయుర్వేద వైద్యానికి పూర్వ వైభవం



జగ్గయ్యపేట, నవంబర్ 7, మేజర్ న్యూస్ : పూర్వకాలంలో ఆయుర్వేదం చాలా ప్రాచుర్యం పొందినదని, ఇది క్రీస్తుపూర్వం నుండి ఆయుర్వేదం ఉందని కేరళ వైద్య నిపుణులు డాక్టర్ బి.ఎస్ రెడ్డి తెలిపారు. ఆయన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నేటి జీవన విధానంలో మార్పు రావడంతో ఆరోగ్య పాలవడం జరుగుతుందని తెలిపారు. కేరళ వైద్యం అనేది ఆయుర్వేదం ప్రకృతి వైద్యం కేరళ ఎంతో ప్రాముఖ్యత వహించింది అన్నారు. ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానాన్ని కొంతమేర ఆధునికరించి కేరళ తరహా వైద్యాన్ని జగ్గయ్యపేట ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది అన్నారు. కేరళ వైద్యం ఎక్కువగా నొప్పులకు పనిచేస్తుందని గత 20 సంవత్సరాల క్రితం ఈ నొప్పులు అనేది లేవని దీనికి గల ప్రధాన కారణం బోరుబావి నీళ్లు తాగటం అన్నారు. కేరళ వైద్యం నొప్పులు, కిడ్నీలో రాళ్లు, పైల్స్ పక్షవాతం, గ్యాస్ ట్రబుల్. మొలలు, మెడ నొప్పి, తొంటి నొప్పి, కీళ్లవాతం వంటి వాటికి పనిచేస్తుందన్నారు. రోగులకు కారణం ఆహారపు అలవాటులో మార్పు.... మనిషి రోగాలకు గురికావడం అనేది ప్రధానంగా ఆహారపు అలవాటు అన్నారు. ఉప్పు అనేది మనిషి తప్పు ఏ జీవి కూడా వాడదని, ఉప్పు ఎక్కువగా వాడితే జబ్బులు వస్తాయని ఉప్పు వాడే శరీర శ్రమ ఉంటే జబ్బులు రావని కానీ ప్రస్తుతం శరీరక శ్రమ ఉండటం లేదని దీంతో జబ్బులు బారిన పడాల్సి వస్తుందన్నారు. ఆకులు తిన్న మేక గట్టు, కొండలు ఎక్కుతుందని, ఆ మేకను తిన్న మనిషి జబ్బులతో మంచం ఎక్కుతున్నాడన్నారు. సమయం, మానసిక, ఒత్తిడి, నిద్రలో జయించి మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. మనిషి రుచి కోసం ఎక్కడైతే తింటాడో అప్పుడు రోగాల బారిన పడతారు. ప్రస్తుత కాలంలో మనిషి ఆకలి కోసం తినేవారు లేరని రుచి కోసం మాత్రమే తింటున్నారనారు. సమయానికి ఆహారం తినటం, నిద్రపోవడంతో పాటు త్వరగా లేవటం వంటి వాటితో మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. ప్రస్తుత కాలంలో ఆయుర్వేదాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నారని ఈ ఆయుర్వేదం వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉంటాయన్నారు. జగ్గయ్యపేటలో కేరళ తరపున ఆయుర్వేద వైద్యం పట్టణ వాసులకు అందుబాటులో వచ్చిందని ఈ ఆయుర్వేదం వల్ల చాలామందికి వ్యాధులు నయం అవుతున్నాయన్నారు. ఈ వైద్యానికి వచ్చే వారికి తమ ఆసుపత్రిలో ఓపి ఫీజు లేదని, మందులకు మాత్రమే డబ్బులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయుర్వేద క్యాంపులు నిర్వహిస్తున్నాం అని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆయుర్వేదాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ కేరళ వైద్యం ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లో ఉచితంగా ఆయుర్వేద క్యాంపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ క్యాంపులో ఆయుర్వేదం ప్రాముఖ్యత తెలియజేయడంతో పాటు ఉచితంగా రోగులను చూడటం వారికి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. వివరాలకు 7207122244, 7207122255 ఈ నెంబర్ల లో సంప్రదించగలరు.



## జనసేన పార్టీలో చేరిన పలువురు ఎస్టీ నాయకులు

జగ్గయ్యపేట, నవంబర్ 7, మేజర్ న్యూస్: జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సమక్షంలో మండల పరిధిలో ఉన్న ధర్మవరప్పాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ భూక్యా శ్రీరాములు నాయక్, తిరుమలగిరి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు గుగులోతు మంగా, బాణవత్ గోపి, చిల్లకల్లు గ్రామానికి చెందిన మండల యూత్ కార్యదర్శి భూక్యా గోపి కృష్ణ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి చిల్లకల్లు గ్రామంలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని వారిని సామినేని ఉదయభాను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, సిద్దినేని నాగు, వత్సవాయి మండల నాయకులు మురిమూరి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను కలసి ఆశీర్వచనాలు తీసుకున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



పామర్రు నవంబర్ 7 మేజర్ న్యూస్ : స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా గురువారం నిడుమోలు మాజీ శాసనసభ్యులు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు పాటూరు రామయ్య ను కలిశారు విజయవాడ కానూరులో పాటూరు రామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామయ్యను సత్కరించి ఆయన ఆశీర్వాదం అందుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా వారి మన్ననలు పొందాలని, వారి కనీస అవసరాలు తీర్చడంలో ముందుండాలని ఈ సందర్భంగా పాటూరు రామయ్య కుమార్ రాజాను కోరారు.



# అక్రమ ఇసుక దందా చేసే వాళ్ళని క్షమించేది లేదు

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకనమ్మ యాదవ్




నందిగామ, నంబరు 7, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ నేతలతో కలసి కంచల ఇసుక డప్పింగ్ చేసి లారీలకు కూలీలు లోడ్ చేసే కేంద్రన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకానమ్మ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా నూకానమ్మ మాట్లాడుతూ అంత బావుంది కూలీలకు చక్కగా పని దొరుకుతుంది కూలీలు సంతోషంగా ఉన్నారు. పేదలకు ఉచితంగా ఇసుక ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశయాలకు తూట్లు పోడవాలి అని సూస్తున్న, వారిని,అక్రమ సంపదనే ధ్యేయంగా పనిచేస్తున్న వారి గుండెల్లో నిద్రపోతాను అని హెచ్చరిక జారీ చేశారు. త్వరలో నందిగామ నియోజకవర్గంలో ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న, అన్ని ఇసుక రిచ్‌లు సందర్శిస్తాను అని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అప్రతిష్ట తెస్తే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా చూస్తూ ఊరుకోను ఎంతటి పోరాటానికి ఉద్యమించడానికి అయిన నేను సిద్ధం చంద్రబాబు గౌరవం కాపాడవలసిన బాధ్యత నాతో పాటు పార్టీ నేతలకు అందరికి ఉంది.

నందిగామ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నేతలకు కార్యకర్తలకు ఎల్లా వేళల అందుబాటులో ఉంటాను అని, ఎవరికీ ఏ సమస్య వచ్చిన ఇబ్బంది జరిగిన నా దృష్టికి తీసుకురావచ్చు అని అధికారులతో చర్చించి పరిష్కారిస్తాను అని హామీ ఇచ్చారు.ఇసుక దాంద వెనుక ఎంత పెద్ద నేతలు ఉన్న సరే కచ్చితంగా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా త్వరలో ఇంక ఏమి ఏమి అక్రమ దందాలు జరుగుతున్నావో కూడ ఆరా తీసి అక్రమాలు జరగకుం చూస్తాను. బాధ్యత తీసుకొని చంద్రబాబు ఆశయాల కోసం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు నూకానమ్మ యాదవ్ తెలియజేశారు.

# ఆక్వా, చేపల మేతల షాపులను తనిఖీ చేసిన అధికారులు





**నందివాడ, మేజర్ న్యూస్ :** మండలపరిధిలోని పోలుకొండ గ్రామంలో అక్వా మేత షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారము తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలో ప్రభుత్వ అధికారులు శిబాశిష్ మహంతి, అసిస్టెంట్ డైరెక్టర్, ఎంపీఈడీపీ విజయవాడ, శ్రీరామ్, డ్రగ్ ఇన్స్పెక్టర్, గుడివాడ, ప్రసాద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, గుడివాడ, రవి కుమార్, ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్, మండల ఫిషరీస్ అధికారులు పాల్గొన్నారు.ఈ తనిఖీలలో భాగంగా అక్వా షాపులలో విక్రయించే వివిధ ఉత్పత్తుల (చేపల, రొయ్యల మేతలను, ప్రోబయోటిక్స్, ఫీడ్ సప్లిమెంట్స్,, మినరల్స్)లను పరిశీలించారు. వాటికి సిఏఏ (కోస్టల్ అక్వాకల్చర్ అథారిటీ) వారి అనుమతులు ఉన్నవో లేదోనని పరిశీలించారు.

నిషేధిత యాంటీ బయోటిక్స్ గల ఉత్పత్తులను విక్రయించరాదని షాపు యజమానులకు తెలియచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారము అక్వా షాపుల వారు ఏపీఎస్ఏడీఏ చట్టం ప్రకారము మత్స్య శాఖ నుండి తగు అనుమతులను తీసుకోవాలని తెలియజేశారు.

# సెల్ ఫోన్స్ స్నాచింగ్ కేసులలో ముద్దాయిలు అరెస్ట్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్ జిల్లాలో జరుగుతున్న దొంగతనాలు లను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారించి నగరంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు క్రైమ్ డీసీపీ కే.తిరుమలేశ్వర రెడ్డి, క్రైమ్ ఏడీసీపీ ఎం.రాజారావు పర్యవేక్షణలో సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్లు, వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మాచవరం, సత్యనారాయణ పురం, అజిత్ సింగ్ నగర్ ఏరియాలలో ముగ్గురు యువకులు బైక్ పై స్పీడ్ గా వెళుతూ సెల్ ఫోన్లను లాక్కొని వెళ్లిపోతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల వారు కేసులు నమోదు చేశారు.

ఈ నేపథ్యంలో సి. సి. ఎస్. పోలీస్ వారు సదరు నేరాలపై సాంకేతిక ఆధారాల సహాయంతో ధర్యాప్తు ప్రారంభించి ధర్యాప్తులో భాగంగా నార్త్ సిసిఎస్ బృందానికి రాబడిన సమాచారం మేరకు గురువారం గుణదల సెంటర్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను సి.సి.ఎస్. నార్త్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాసరావు వారి సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించగా వారిలో గుడివాడకు చెందిన చప్పిడి రాహుల్ బాబు (19), మిగిలిన ఇద్దరు జువైనల్స్ గా గుర్తించారు. ఈ ముగ్గురు వ్యసనాలకు అలవాటు పడి వారి ఖర్చులకు ఎలాగైనా సులువుగా మార్గం లో డబ్బు సంపాదించాలని అనుకోని ఒంటరి మహిళను గమనించి వారి చేతులలోని లాక్కొని వెళ్లిపోయి అమ్ముకొని జల్సాలు చేద్దాము అనుకున్నారు. సదరు ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ పై తిరుగుతూ ఈ నెల 5న మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కరెన్సీ నగర్ బస్ స్టాప్ వద్ద ఉన్న మహిళా వద్ద సెల్ ఫోన్ లాక్కొని వెళ్ళిపోయారు. అదే రోజు కేదారేశ్వర పేట, శారదా కళాశాల బస్ స్టాప్ లలో ఒంటరిగా ఉన్న వారి వద్ద నుండి సెల్ ఫోన్స్ లాక్కొని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈ రోజు గుణదల సెంటర్ వద్ద సి. సి. ఎస్., మాచవరం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముగురిని అదుపులోనికి తీసుకుని విచారించి నిందితుల వద్ద నుండి సుమారు 02 లక్షల విలువైన మూడు సెల్ ఫోన్సు, స్నాచింగ్ లకు ఉపయోగించిన ఆర్. వన్ 5 బైకును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేయడం జరిగింది. జువైనల్స్ లను జువైనల్ హోంకు తరలించారు.



## ఆర్థిక చేయూత అందించేందుకు సొసైటీని స్థాపించాం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కాల్ మనీ వ్యాపారుల బారిన, లోన్ యాప్ బారిన పడకుండా వారికి రుణాలు ఇచ్చి ఆర్థిక చేయూత అందించేందుకు సంస్థను స్థాపించినట్లు గోదావరి, కృష్ణా కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ మేడూరి జీవన్ అన్నారు. చల్లపల్లి పోలీస్ స్టేషన్ ప్రక్కన నూతనంగా ప్రారంభించిన గోదావరి, కృష్ణా కో-ఆపరేటివ్ సొసైటీని చైర్మన్ జీవన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ మాట్లాడుతూ, చిన్న, మధ్య తరహా వ్యాపారులు కాల్ మనీ బారిన పడకుండా వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపడాలనే ముఖ్య ఉద్దేశంతో సొసైటీని స్థాపించినట్లు తెలిపారు. వినియోగదారుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీని ముందుకు తీసుకెళతామన్నారు. తమ సొసైటీలో బంగారంపై రుణాలు, మార్ట్ గేజ్ రుణాలు అందించడంతో పాటు లాకర్ సదుపాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు 12 బ్రాంచ్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సొసైటీ ద్వారా త్వరలో మండలానికి ఒక బ్రాంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. పదివేల మందికి పైగా ఉపాధి కల్పన ధ్యేయంగా తమ బ్రాంచ్ లు పనిచేస్తాయన్నారు. తమ సొసైటీలో డిపాజిటర్లకు అత్యధిక వడ్డీతో పాటు చిన్న, మధ్య తరహా వ్యాపారులకు తక్కువ వడ్డీతో కూడిన రుణాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తమ సొసైటీ అందిస్తున్న మరిన్ని సేవలను జీవన్ వెల్లడించారు. చల్లపల్లి బ్రాంచ్ మేనేజర్ బుద్ధు మోహన కృష్ణ కిషోర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ సేల్స్ అధికారి శివరామకృష్ణ, లోన్ల విభాగం ప్రతినిధి వెంకటేష్, చింతా సత్యనారాయణ మూర్తి, కరమతుల్ల మహమ్మద్, హరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళలో దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన సదస్సు




**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్ బి కాలనీ, స్వాతి రోడ్ లో గల సిద్ది అపార్ట్మెంట్ లో నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, దొంగతనాలు ఏవిధంగా, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పోలీస్ కమీషనర్ ప్రవేశపెట్టిన ఇ-పహారా గురించి, డైయల్ 100, 112, 1930, ఎల్ హెచ్ఎంఎస్ యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి సి.సి.ఎస్. అధికార్లు, వారి సిబ్బందితో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైమ్ ఏడీసీపీ ఎం. రాజా రావు సమావేశంలోని ప్రజలతో మాట్లాడుతూ, ఊరు వెళ్ళే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని, ఎల్ హెచ్ఎంఎస్ యాప్ను ఉపయోగించుకోవాలని, దీని వలన ఎవరైనా దొంగ ఇంటిలోనికి వస్తే వెంటనే అలారం మోగడం తోపాటు సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరి దొంగలను పట్టుకోవచ్చు, దొంగతనం జరగకుండా చూడవచ్చని, మీ దగ్గర ఉన్న విలువైన వస్తువులను లాకర్స్ లలో పెట్టుకోవాలని, పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా ఈ పహారా యాప్ ద్వారా బీటు పోలీస్ వారికి త్వరితగతిన సూచనలు అందించడానికి ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా అపార్ట్మెంట్ల పరిసరాలను పరిశీలించి చుట్టూ లైటింగ్ పెంచుకోవాలని, సెక్యూరిటి పరంగా సి.సి.కెమెరాలను, వాచ్ మెన్ లను ఏర్పాటు చేసుకోవాలని, సదరు వాచ్ మెన్లు అపార్ట్మెంట్ వద్దకు రాత్రి సమయంలోనే కాకుండా పగటి సమయంలో ఎవరు వచ్చిన వారిని ఎవరు ఎందుకు వచ్చారు అని ప్రశ్నించే విధంగా తగు సూచనలు ఇవ్వాలని ఈ విధంగా అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.



## 13న 105 టన్నుల ఇసుక వేలం

**తహసీల్దార్ జాహ్నవి**

**కంచికచర్ల నవంబర్ 7 మేజర్ న్యూస్ :** గ్రామాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను బహిరంగ వేలం ద్వారా పాటదారులకు అప్పగించడం జరుగుతుందని తహసీల్దార్ జాహ్నవి తెలిపారు గురువారం తహసీల్దార్ ఒక ప్రకటన ద్వారా తెలియజేస్తూ మండలంలోని గండేపల్లి, మొగులూరు, నక్కలంపేట, చెవిటికల్లు గ్రామములలో సుమారుగా 105 టన్నులు నిల్వ చేసిన అక్రమ ఇసుక నిల్వలను స్థానిక పోలీసు వారు గుర్తించడం జరిగింది.సదరు ఇసుకను బహిరంగ వేలము ద్వారా ఈనెల 13న అమ్మేందుకు వేలము నోటీసు జారీ జారీ చేశారు.కావున సదరు ఆదేశాల మేరకు బుధవారం 1.00 గంటకు తహసీల్దార్ కార్యాలయము వద్ద బహిరంగ వేలము వేయుటకు నిర్ణయించారు. వేలంలో పాల్గొను వారు పైన తెలిపిన తేదీన పాల్గొనవలసినదిగా తెలిపారు.

## రేషన్ బియ్యం పక్కదారి పట్టించవద్దు

**తిరువూరు ఆర్డీవో మాధురి**



**గంపలగూడెం, మేజర్ న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరిగితే సహించేది లేదని తిరువూరు ఆర్డీవో కే మాధురి అన్నారు. గంపలగూడెం మండలంలోని పెనుగొలను లోని రెండు చౌక ధరల దుకాణాలను ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణములపై వచ్చిన పలు ఆరోపణలపై స్పందించిన ఆమె ఎండీయు వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, బియ్యం నిల్వలను పరిశీలించారు. సదరు వాహనంలో 500 కిలోల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఎం డీ యు ఐ తిరుపతిరావు పై 6ఎ కింద కేసు నమోదు చేయాలని గంపలగూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, డిప్యూటీ తహసీల్దార్ శివ నాగరాజు లను ఆదేశించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన తహసీల్దార్ రాజకుమారి అదనంగా ఉన్న బియ్యం ను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి కృషి



**గంపలగూడెం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు గంపలగూడెం తహసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. గురువారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ మండలంలో జరిగిన రీ సర్వే గ్రామాల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించే క్రమంలో ఉన్నట్లు చెప్పారు. 10 గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో మొత్తం 383 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. అందులో మేజర్ గా, పాస్ పుస్తకాలు, ఎల్పిఎం తదితర అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన సమయం కేవలం 15 రోజులు మాత్రమేనని, అందుకు తమ సిబ్బంది ఎక్కువ సమయం వెచ్చించి, పనిచేస్తున్నట్లు వివరించారు. ఈలోపే ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా, ఓటర్ల నమోదు అర్జీలను పరిశీలించే కార్యక్రమంలో తమ సిబ్బంది నిమగ్నమైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి పనిలోనైనా వ్యత్యాసాలు, సమస్యలు తలెత్తకుండా పనిచేస్తున్నట్లు రాజకుమారి వెల్లడించారు.

## ప్రజల క్షేమమే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని, విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజకవర్గం కొండ ప్రాంత ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని ప్రతిరోజు 24 గంటలు త్రాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని, విజయవాడలో ఉన్న స్టేడియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికను సిద్ధం చేయమని, కార్పొరేషన్ కి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేయాలని, వివిఎంసి ఆర్థిక పుష్టికి విజయవాడ నగర అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీ వి జీ ఎస్ వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు సత్యనారాయణ, సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, సామ్రాజ్యం, సాప్ సభ్యులు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడండి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజలకి ఎటువంటి సౌకర్యం కలగకుండా చూసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా మాచవరం పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండపై నుంచి వచ్చే వ్యర్థాలన్ని కింద పేరుకుపోవడం గమనించి, వెంటనే డిసిల్టింగ్ పనులను మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని రోడ్డు పై ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మూత సరిగ్గా లేకపోవడం గమనించి సత్వరమే మూతను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎటువంటి అసౌకర్యాలు చూసుకోవాలని నిత్యం పరిస్థితిని నిర్వహణ సక్రమంగా జరిపిస్తూ భూగర్భ డ్రైనేజీ పొంగకుండా చూసుకోవాలని, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇంజనీర్ పి. సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# మంత్రి కొల్లు రవీంద్రనీ మర్యాదపూర్వకంగా కలిసిన డీఈఓ రామారావు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా నూతన డిఈఓగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన పీవీజే రామారావు రాష్ట్ర గనులు మైనింగ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా డిఈఓ రామారావు ఈనెల 11వ తేదీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మ దినోత్సవాన్ని, జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేయాలని, విలువైన సందేశాన్ని అందించాలని మంత్రి రవీంద్రను, డిఇఓ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వీరు నవంబర్ 11, 1888లో మక్కాలో జన్మించారని, ఫిబ్రవరి 22 1958 లో ఢిల్లీలో స్వర్గస్తులయ్యారని తెలిపారు. భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి దక్కిందన్నారు. వీరి అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అని, అబుల్ కలాం వీరి బిరుదు అని, ఆజాద్ కలం పేరని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ప్రముఖ వ్యక్తిగా అబుల్ కలాం పేరు స్మరిస్తామని, అందువల్లే ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటామని అన్నారు. జాతీయ ఉద్యమంలో పాల్గొని, ప్రముఖ జాతీయ నాయకుడిగా ఎదిగిన భారతీయ పండితుడు ఆజాద్ అన్నారు. వీరు పాత్రికేయులు గా కూడా పనిచేసారని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి స్వాతంత్ర సమరయోధుడిని స్మరించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని రవీంద్ర అన్నారు. నవంబర్ 11 జాతీయ విద్యా దినోత్సవాన్ని కృష్ణా జిల్లాలో ఘనంగా నిర్వహించాలని, డీఈవో రామారావును ఆదేశించారు. మంత్రి నారా లోకేష్ విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి వినూత్న సంస్కరణలు తీసుకువస్తున్నారని, కృష్ణాజిల్లాను విద్యా రంగంలో ప్రథమ స్థానంలో నిలిపేలా, పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలాగా కృషి చేయాలని డీఈఓ రామారావుకు మంత్రి రవీంద్ర సూచించారు. డివైఈవో శేఖర్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల సర్దుబాటుపై సబ్ స్టేషన్ ముట్టడి




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం కరెంట్ సబ్ స్టేషన్ దగ్గర గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేయు దోపిడీకి నిరసనగా జరిగే కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని తక్షణమే పెరిగే విద్యుత్తు చార్జీలు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనుకకు తీసుకోవాలని నేతలంతా ప్లే కార్డు లు, లాంతర్లు పట్టుకుని నిరసన తెలిపారు. కుడి చేత్తో ఇస్తూ ఎడమ చేత్తో ప్రజల దగ్గర నుండి కూటమి ప్రభుత్వం వసూళ్లు, రాష్ట్ర ప్రజలకు కరెంట్ షాక్ ఇచ్చిన కూటమి సర్కార్ జగన్ బాటలోనే నడుస్తున్న ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో అమలు పరచలేని హామీలు ఇచ్చి అవి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూ, ఈ రోజు మైలవరం కరెంట్ సబ్ స్టేషన్ దగ్గర ఏపీ నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపటం పై పార్టీ ఆద్వర్యం లో " నిరసన " కార్యక్రమం జరిగింది అని అన్నారు. విద్యుత్తు సర్దుబాటు చార్జీల భారం అప్పటి జగన్ ప్రభుత్వానిదేనని ఈ రోజు కూటమి ప్రజా ప్రతినిధులు మాట్లాడటం బాధాకరం అని అన్నారు. ప్రజలపై రూ.వేల కోట్ల భారం వేయ డం వల్లే ప్రజలు వారిని కాదని మీకు అధికారం ఇచ్చారని,కానీ మీరు వైకాపా చేసిన పాపం అని ఈ రోజు ఈ కూటమి ప్రభుత్వం ఛార్జి ల పేరుతో ప్రజల దగ్గర దోచుకోవటానికి సిద్దమయ్యారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వా నికి ఓట్లు వేయడమే ప్రజలు చేసిన పాపమా అని ప్రశ్నించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అవ కతవకలు జరిగాయని గతంలో మీరు ప్రతిపక్షం లో వున్నప్పుడు చెప్పారని, ఇప్పుడు దానిపై ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజ లకు హై ఓల్టేజ్ షాక్ ఇచ్చారని అన్నారు.. ఇప్పటికే రూ. 6 వేల కోట్ల భారాన్ని మోపి,ఇది చాలదన్నట్లు ఇంకో రూ.12 వేల కోట్ల భారం వేసేందుకు సిద్ధం ఈ ప్రభుత్వం అయింది అని అన్నారు. సుమారు 18 వేల కోట్ల భారం ప్రజల పై మోపడం దారుణమన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో వేసిన రూ. 18 వేల కోట్ల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని బొర్రా కిరణ్ డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమం లో మాజీ పీసీసీ ప్రధాన కార్యదరిశి పోతురాజు ఏసు దాస్, మైలవరం నియోజకవర్గం, మండలం నాయకులు శీలం రామకృష్ణ, దోసపాటి గిరి కుమార్, పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు,మసనం సుధాకర్,అడ్డగిరి ముసలయ్య,అక్కల ప్రసాద్, చెఱుకు ఆనందరావు,యూ శ్రీను, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేధస్సే తన ఇంటి పేరు అంటున్న శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ విద్యార్థిని శ్రీవల్లి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** టాలెంట్ సెర్చ్ ఫౌండేషన్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ నిర్వహించిన పోటీలలో చిరంజీవి విష్ణు మొలకల కోమల శ్రీవల్లి ప్రపంచ పటంలోని 42 ప్రదేశాలు గుర్తించడమే కాక, 25 వైద్య పరిభాష పదాలు గుర్తించి ఒక్క నిమిషంలో చెప్పగలిగింది. శ్రీవల్లి చేతనలోని శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్‌కు చెందిన ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండవ తరగతి చదువుతోంది. శ్రీవల్లిని శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంగా దేవి అభినందిస్తూ బాలల్లో వివిధ అంశాల పట్ల గల ఆసక్తిని చిన్న వయసులోనే గుర్తించి వారిలోని ప్రజ్ఞను వెలికితీయడానికి అన్ని అవకాశాలను కలిగించాలని అన్నారు. శ్రీవల్లిని ఆ దిశలో ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను బాల కుటీర్ సీఏవో రఘురాం, సహకార్యదర్శి జయశ్రీ, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపల్స్ నజ్రీన్, లక్ష్మీ ప్రసన్న, వెంకటేశ్వరరావు అభినందించారు.

## బాలల హక్కులపై అవగాహన




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బాలల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వేకనూరు పిహెచ్ సి వైద్యులు రాహుల్ ప్రభాకర్ అన్నారు. గురువారం రాహుల్ ప్రభాకర్ ఆధ్వర్యంలో వేకనూరు పీహెచ్ సెంటర్లో అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కలిగించారు సమగ్ర బాలల సంరక్షణ విభాగం వారు నిర్వహించిన అవగాహన సదస్సులో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ లేక పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేయించకూడదని సేవించినట్లయితే చేసిన వారికి చేయించుకున్న వారికి వీరిని ప్రోత్సహించిన వారికి జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించడం జరుగుతుందన్నారు బాలల సట్టాలైన బాల్య వివాహాలు నిరోధక చట్టం లైంగిక వేధింపులు బాలల అక్రమ రవాణా బాలల భిక్షాటన బాల కార్మికులు బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కలిగించారు ఐసిడిఎస్ సిడిపిఓ శేషు కుమారి మాట్లాడుతూ బాలలు వారి హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి అన్నారు ఈ కార్యక్రమంలో డిసిపిఎం సభ్యులు ప్రేమలత శ్యామల చైల్డ్ కౌన్సిల్ సూరి బాబు, ఓ ఎస్ సి సిబ్బంది శిరీష ఐసిడిఎస్ సూపర్వైజర్ రత్నమాల అంగన్వాడి కార్యకర్తలు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ఎం పి హెచ్ ఓ హెల్త్ సూపర్వైజర్‌తో పాటు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ రవీంద్ర బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999